# అంపశయ్యపై హోంగార్డు

**రెండేండ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్న శంకర్ • రెండు నెలలుగా విధులకు దూరం • భార్యకు గుండె సంబంధిత వ్యాధి**

- ఇద్దరికీ నా అన్నవాళ్లు లేరు
- 20 ఏండ్లుగా పోలీస్ శాఖలో సేవలు
- డిపార్ట్‌మెంట్ సహకారం కరువు
- తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబం

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 26 (నమస్తే తెలంగాణ): ఇరవై ఏండ్లుగా పోలీస్ శాఖలో చాలీచాలని వేతనంతో 24 గంటలు సేవలందించిన హోంగార్డు ఇప్పుడు అంపశయ్యపై ఉన్నాడు. రెండేండ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. అప్పులు చేసి వైద్యం చేయించుకుంటున్నాడు. భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు మినహా వాళ్లకు నా అనే వాళ్లు లేరు. ఆస్తిపాస్తులు లేవు. సొంత డిపార్ట్‌మెంట్ సహకారం ఇంతవరకూ అందలేదు. క్యాన్సర్‌తో బాధపడుతూనే విధులు నిర్వర్తించాడు. రెండు నెలలుగా అతడి పరిస్థితి విషమించింది. చికిత్స చేసుకోవడానికి ఆర్థిక స్తోమత లేక ఇంటికే పరిమితమయ్యాడు. అటు భార్యకు అనారోగ్యం.. ఇటు భర్తకు క్యాన్సర్... ఇద్దరు ఆడపిల్లలు.. చిన్న బిడ్డకు మూడేండ్లు.. అద్దె ఇంట్లో జీవనం గడుపుతున్న ఆ కుటుంబం... క్లిష్ట పరిస్థితుల్లో చాలా దీనంగా చేయూత కోసం ఎదురుచూస్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో ఉంటున్న మామిడాల శంకర్ అనే హోంగార్డు దీన పరిస్థితి ఇది. ప్రభుత్వం, పోలీస్ శాఖ ఆదరణ కరువై మృత్యువుతో



చికిత్స పొందుతున్న హోంగార్డు శంకర్

పోరాడుతున్నాడు. మానవీయ కోణంలో ఎంతోమందికి సహాయం చేస్తున్న పోలీస్ శాఖ శంకర్ విషయంలో ఎందుకో పట్టనట్టుగా వ్యవహరిస్తున్నది. సొంతశాఖ పట్టనట్టు వ్యవహరిస్తే మాకు దిక్కెవరు? అని ఆ కుటుంబం రోదిస్తున్నది.

### కుటుంబం ఛిన్నాభిన్నం

గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మామిడాల శంకర్ భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. అతడికి తల్లిదండ్రులు, అన్నదమ్ములు ఎవరూ లేరు. భార్యకూ తల్లిదండ్రులు లేరు. ఉన్న ఒక్క అన్నయ్య చనిపోయాడు. ఇద్దరికీ నా అన్నవాళ్లు లేక శంకర్ చేసే హోంగార్డు ఉద్యోగంపైనే జీవనం గడుపుతున్నారు. క్యాన్సర్ మహమ్మారి ఆ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. రెండేండ్ల క్రితం శంకర్‌కు క్యాన్సర్ సోకడంతో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్నారు. మళ్లీ ఆపరేషన్‌కు ఆరోగ్యశ్రీ కింద అవకాశం లేకపోవడంతో అప్పులు చేసి చికిత్స పొందుతున్నాడు. వారానికి ఐదు రోజులు హైదరాబాద్‌లో రేడియేషన్ చేయించుకుంటూ గాలిలో దీపంలా ప్రాణాలు నిలబెట్టుకుంటున్నాడు. శంకర్‌కు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్దకూతురు లక్ష్మీసువిధ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా, చిన్న కూతురు లక్ష్మీఅవంతికకు మూడేండ్లు. ఇద్దరు కూతుళ్ల పరిస్థితి ఏమిటని శంకర్ భార్య విలపిస్తున్నది.

### నా భర్తను బతికించండి



నాకు ఇద్దరు ఆడపిల్లలు. మాకు వేరే ఆధారం లేదు. నా భర్తకు, నాకు తల్లిదండ్రులు లేరు. మాకు ఇతర ఆస్తులు లేవు. ఆయన హోంగార్డు ఉద్యోగం చేస్తేనే మాకు బతుకు. ఇప్పుడు ఆయనకు క్యాన్సర్. ఆరోగ్యశ్రీపై చికిత్సలు చేయించిన. ఇప్పుడు చికిత్సలకు అప్పులు చేస్తున్నా. అప్పులు ఎలా తీర్చాలి. ఇద్దరు ఆడపిల్లల పరిస్థితి ఏమిటి? రెండేండ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. రెండు నెలలుగా పూర్తిగా ఆరోగ్యం క్షీణించింది. డ్యూటీకి వెళ్లడం లేదు. ఇంట్లో పూటగడవడం లేదు. నాకు కుడిచేయి పనిచేయదు. అన్నం కూడా ఎడమచేత్తో తింటాను. గుండె సమస్య ఉంటే డబ్బులు లేక చికిత్స చేయించుకుంటలేను. ఇప్పటివరకు పోలీసు అధికారులు ఎలాంటి సహకారం అందించడం లేదు. అప్పుడు ఎస్పీ సురేందర్‌రెడ్డి దగ్గరికి మా ఆయనను తీసుకుని వెళ్లి కలిసిన. పట్టించుకోలేదు. దయచేసి మా ఆయనను బతికించండి. మా కుటుంబాన్ని నిలబెట్టండి.

*- విజయలక్ష్మి, శంకర్ భార్య*



రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అసెంబ్లీ కార్యాలయ అధికారులు

# పేపర్లు లేకుండా కేసు వాదిస్తే ఏకంగా 2 వేల పేజీల నోట్స్!

- సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రతిభకు న్యాయనిపుణులే నివ్వెరపోయారు
- గణతంత్ర వేడుకల్లో జస్టిస్ సుజయ్‌పాల్

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జూనియర్ న్యాయవాదిగా బాంబే హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు చేతిలో ఎలాంటి పత్రాలు లేకుండా ఓ కేసును వాదించి చరిత్ర పుటల్లో నిలిచారని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ వెల్లడించారు. ఆయన చెప్పిన విషయాలను కోర్టు అధికారులు రికార్డు చేయడంతో ఏకంగా 2,000 పేజీలు అయ్యాయని, పటేల్ వాదించిన వైనాన్ని చూసి నాటి బ్రిటిష్ పాలకులు, న్యాయనిపుణులతోపాటు యావత్ న్యాయవ్యవస్థే నివ్వెరపోయిందని చెప్పారు. నేటి యువ న్యాయవాదులు తమ వృత్తిలో రాణించాలంటే వల్లభాయ్ పటేల్ లాంటివారిని స్ఫూర్తిగా తీసుకోవాలని జస్టిస్ సుజయ్‌పాల్ పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన హైకోర్టులో పోలీసుల వందనాన్ని స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు బార్ అసోసియేషన్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, ఏజీ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



జాతీయ పతాకం ఆవిష్కరించిన తర్వాత సెల్యూట్ చేస్తున్న జస్టిస్ సుజయ్‌పాల్

# రాజ్యాంగం యుగయుగాలకు స్ఫూర్తి

- సంపద, సామరస్యం వైపు తెలంగాణ పయనం
- సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ కోసమే ప్రభుత్వ పాలన
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందేశం
- పరేడ్ గ్రౌండ్స్‌లో అట్టహాసంగా వేడుకలు

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): రాజ్యాంగం యుగయుగాలకు స్ఫూర్తి అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ సందేశం ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'ఎక్కడైతే మనసు భయం లేకుండా ఉంటుందో, తల ఎత్తుకుని ఉండగలమో, ఎక్కడైతే స్వేచ్ఛగా జ్ఞానాన్ని సముపార్జించగలమో, నాలుగు గోడల మధ్య ప్రపంచం ముక్కలుగా విడిపోదో..' అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ వ్యాఖ్యలు సమైక్య, సమ్మిళిత, ప్రగతిశీల తెలంగాణ రాష్ట్ర దృక్పథాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి దార్శనికుడు, ఇతర రూపకర్తల ఆధ్వర్యంలో రూపొందిన భారత రాజ్యాంగం చట్టపరమైన పత్రం మాత్రమే కాదని, మన ప్రజాస్వామ్యాన్ని తీర్చిదిద్దిన మార్గదర్శి అని కొనియాడారు. అంబేద్కర్ చెప్పినట్టు.. రాజ్యాంగం కేవలం న్యాయపత్రమే కాదని, అది జీవన వాహకమని, యుగయుగాలకు స్ఫూర్తి వంటిదని పేర్కొన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముకగా నిలుస్తున్నదని, 2024 వానాకాలంలో రికార్డు స్థాయిలో 1.59 కోట్ల టన్నుల వరి ధాన్యం పండిందని స్పష్టం చేశారు. దేశంలోనే తెలంగాణ అత్యధిక వరి ఉత్పత్తి సాధించిందని చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద ఇప్పటి వరకు 133.91 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణాలు చేసి రూ.4,501.10 కోట్లను ఆదా చేశారని వెల్లడించారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ జితేందర్, జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ తదితరులు పాల్గొన్నారు.





గవర్నర్ నుంచి అవార్డులు స్వీకరిస్తున్న టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారుఖీ, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి

### రాజ్‌భవన్‌లో ఎట్ హోం

రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేశ్ వర్మ ఏర్పాటు చేసిన తేనీటి విందుకు సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ హాజరయ్యారు.

### అధికారులకు అవార్డులు

| అధికారి | హోదా |
| --- | --- |
| విక్రమ్ సింఘ్ మాన్ (ఐపీఎస్) | అడిషనల్ కమిషనర్, హైదరాబాద్ (ఎల్ అండ్ వో) |
| ముషారఫ్ ఫారుఖీ (ఐఏఎస్) | టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ |
| అనురాగ్ జయంతి (ఐఏఎస్) | జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ |
| ఎస్ హరీశ్ (ఐఏఎస్) | ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి |
| ఈవీ నర్సింహారెడ్డి (ఐఏఎస్) | విద్యాశాఖ డైరెక్టర్ |
| అనుదీప్ దురిశెట్టి (ఐఏఎస్) | హైదరాబాద్ కలెక్టర్ |
| కర్నాటి వరుణ్‌రెడ్డి (ఐఏఎస్) | టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ |
| కే విద్యాసాగర్ | సీఎస్ ఓఎస్డీ |
| జీ రాజేశ్వర్‌రెడ్డి | సీఈ, ఆర్ అండ్ బీ |
| మామిడి హరికృష్ణ | సాంస్కృతిక శాఖ డైరెక్టర్ |
| ఎల్ నర్సింహారావు | ఎస్ఈ, ఆర్ అండ్ బీ |
| కే మనోహర్‌బాబు | ఈఈ, ఆర్ అండ్ బీ |
| వీ సర్వేశ్ కుమార్ | సీనియర్ కన్సల్టెంట్, సీఎస్ ఆఫీస్ |
| స్పెషల్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు | |
| చంద్రశేఖర్ రెడ్డి | సీఎం కార్యదర్శి (పీఆర్ఎల్) |

### నేడు మధ్యప్రదేశ్‌కు రాష్ట్ర క్యాబినెట్

- సంవిధాన్ బచావో ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్తున్న ముఖ్యమంత్రి, మంత్రిమండలి

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం సోమవారం మధ్యప్రదేశ్ వెళ్లనున్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏండ్లు పూర్తవుతున్నందున నేపథ్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జన్మస్థలమైన మౌ గ్రామంలో సంవిధాన్ బచావో ర్యాలీకి ఏఐసీసీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి కాంగ్రెస్ నేతలు తరలివెళ్తున్నారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తదితరులు ఈ ర్యాలీలో పాల్గొననున్నారు. కాగా, ఈ నెల 16 దావోస్ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి దాదాపు 9 రోజులు పర్యటించి 25న తిరిగి హైదరాబాద్ వచ్చారు. అదే సమయంలోనే రాష్ట్ర మంత్రివర్గమంతా కర్ణాటక రాష్ట్రం వెళ్లివచ్చింది. తాజాగా మళ్లీ రాష్ట్ర పరిపాలన వదిలేసి పొరుగు రాష్ట్రం బాట పట్టడంపై ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు.



సత్యనారాయణ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు

### మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ కన్నుమూత

- నివాళులర్పించిన మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు
- సీఎం, మంత్రుల సంతాపం

హైదరాబాద్/ సంగారెడ్డి, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్సీ ఆర్ సత్యనారాయణ ఆదివారం సంగారెడ్డిలోని తన నివాసంలో కన్నుమూశారు. కుటుంబసభ్యులు, బంధువులు, అభిమానులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు, ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. సంగారెడ్డిలోని రాజంపేట వద్ద ఉన్న వైకుంఠధామంలో కుమారుడు నూతన్ అంతిమసంస్కారాలు నిర్వహించారు. సత్యనారాయణ మృతిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం వ్యక్తంచేశారు. సీనియర్ జర్నలిస్టుగా, తెలంగాణ ఉద్యమకారుడిగా ఆయన సేవలు, బీఆర్ఎస్ కోసం చేసిన కృషిని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో సత్యనారాయణ సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సంగారెడ్డిలోని సత్యనారాయణ నివాసంలో పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, మాజీ మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవీప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ బాధిత కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు రాజనర్సింహ,పొన్నం ప్రభాకర్ సంతాపం ప్రకటించారు. సత్యనారాయణ జర్నలిస్టుగా పీడిత ప్రజల పక్షాన నిలిచారు. 2001లో బీఆర్ఎస్‌లో చేరి తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పనిచేశారు.

# అంతా తిరుపతిరెడ్డి చూసుకుంటడు!

- నేను రాష్ట్రమంతా తిరుగుతా
- పదవి లేకపోయినా ప్రజాసేవ చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి
- నారాయణపేట జిల్లా చంద్రవంచలో నాలుగు పథకాల ప్రారంభం
- జనం లేకపోవడంతో వెలవెలబోయిన సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం

మహబూబ్‌నగర్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): "నేను రాష్ట్రంలో నలుమూలలను తిరిగినా మీకు అండగా తిరుపతిరెడ్డి ఉంటాడు, మీకు ఏ కష్టం వచ్చినా.. ఏ పదవి ఉన్నా లేకపోయినా మీకోసం ఎప్పటికప్పుడు మా సోదరుడు మీకు అండగా నిలబడ్డాడు" అని చంద్రవంచ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. ఆదివారం నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని చంద్రవంచ గ్రామంలో రైతుభరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ ఎట్లకేలకు తన షాడో సీఎంగా కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు తన సోదరుడు తిరుపతిరెడ్డి అందుబాటులో ఉంటాడని ప్రజాపాలన సాక్షిగా వెల్లడించారు. "రామారావు అంటున్నాడు.. ఆయనకు ఏం పదవి ఉందని, నేను అడుగుతున్న మీ కుటుంబంలో అందరికీ పదవులున్నాయి. మాకు ఏ పదవీ లేకుండా ప్రజలకు సేవ చేసేందుకు, ఆదుకునేందుకు ముందుకు వస్తాం. ఎవరికి ఏ కష్టం వచ్చినా తిరుపతిరెడ్డి మీకు ఉంటాడు" అని చెప్పుకొచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా తాను రాష్ట్రం మొత్తం తిరుగుతుంటే ఈ నియోజకవర్గానికి అండగా తమ కుటుంబసభ్యులు ఉంటారని రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలని భూములు సేకరించడానికి వెళితే కొంతమంది కావాలని అధికారులపై దాడులకు ఉసిగొలిపి చంపడానికి ప్రయత్నించారని విమర్శించారు. నియోజకవర్గంలోని యువతకు ఉపాధి కల్పించవద్దా? పరిశ్రమలు తేవద్దా? అంటూ రేవంత్ ప్రశ్నించారు. వెనుకబడ్డ కొడంగల్ నియోజకవర్గానికి ఏదో చేద్దామని ప్రయత్నిస్తే కొందరు కావాలని అడ్డుకుంటున్నారని ఆరోపించారు.



సీఎం సభలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

### బోనస్ ఇచ్చి ఆదుకున్నా

కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయినా దేశం మొత్తం మీద కోటి 56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించి రూ.500 బోనస్ ఇచ్చి రైతులను ఆదుకున్నామని రేవంత్ చెప్పారు. పదేండ్లైనా పాలమూరు ఎత్తిపోతల, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తి కాలేదని చెప్పుకొచ్చారు. రెండు ప్రాజెక్టులు పూర్తి చేయాలని ప్రయత్నిస్తుంటే కొందరు కాళ్లలో కట్టెలు పెడుతున్నారని విమర్శించారు.

### జనం లేక రేవంత్ తడబాటు

నారాయణపేట జిల్లా చంద్రవంచలో ప్రారంభించిన నాలుగు పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ గ్రామసభకు కొడంగల్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున జనం వస్తారని ఆశించి ఏర్పాట్లు చేశారు. వేసిన టెంటు కింద కూడా జనం లేకపోవడంతో రేవంత్ స్పీచ్ వెలవెలబోయింది. సవాళ్లు ప్రతీ సవాళ్లు లేకుండానే సప్పగా సాగింది. ప్రతీసారి ఆయన జనం వైపు చూడడం అక్కడ కుర్చీలన్నీ ఖాళీగా ఉండడంతో ఏం మాట్లాడాలో తెలియక కేవలం పథకాల గురించి ప్రస్తావించారు. కొడంగల్ నియోజకవర్గంలో అంతా తన సోదరుడు తిరుపతిరెడ్డి చూసుకుంటాడని చెప్పడానికే వచ్చినట్టు సభ సాగింది.


### జిల్లా కలెక్టర్‌కు రెండో వరుసలో సీటు

చంద్రవంచ సభలో నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ రెండో వరుసలో సీటు కేటాయించారు. సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి మాత్రం ఏకంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి పక్కన సీటు కేటాయించడం విమర్శలకు తావిచ్చింది. సీఎం రాగానే నివేదికను కలెక్టర్ వెనుక నుంచి ఇచ్చారు. ముందు వరుస అంత కాంగ్రెస్ నాయకులు కూర్చోవడంతో చివరకు కలెక్టర్ వెనుక వరుసలో కూర్చోవాల్సి వచ్చింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం తీవ్ర నిరాశకు గురయ్యారు.

# యూనివర్సిటీల పునర్నిర్మాణం జరగాలి

- వర్సిటీలపై కేంద్రం పెత్తనాన్ని సహించం
- పద్మ అవార్డుల్లో తెలంగాణకు అన్యాయం
- ప్రధానికి లేఖ రాస్తా: సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో యూనివర్సిటీల పునర్నిర్మాణం జరగాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, డిజిటల్ రిసోర్స్ సెంటర్, సెంట్రల్ ఇన్‌స్టుమెంటేషన్, ఎసెన్షియల్ స్టాఫ్ క్వార్టర్లకు శంకుస్థాపన చేశారు. దీంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నాలుగు పథకాల అమలు సందర్భంగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశంలో మళ్లీ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలనే చర్చ జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. తెలంగాణ సమాజానికి చికిత్స అందించాల్సిన బాధ్యత యూనివర్సిటీ వీసీలపై ఉన్నదని స్పష్టం చేశారు. పదేండ్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, అమలు చేసే బాధ్యత తాము తీసుకుంటామని వీసీలకు సూచించారు. యూనివర్సిటీల ప్రైవేటీకరణ ఆలోచన మంచిది కాదని హితవు పలికారు. యూజీసీ నిబంధనల్లో మార్పులు చేసి, రాష్ట్రాల పరిధి నుంచి వాటిని తప్పించి.. యూనివర్సిటీలపై పెత్తనం చెలాయించాలని కేంద్ర కుట్రలు పన్నుతున్నదని తెలిపారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. తమ హక్కులను వదులుకోవడానికి సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. రాష్ట్రాల అధికారాలను ఒక్కొక్కటిగా కేంద్రం గుంజుకుంటే.. రాష్ట్రాలు కేవలం పన్నులు వసూలు చేసే సంస్థలుగా మిగిలిపోతాయని పేర్కొన్నారు.



### పద్మ అవార్డుల్లో అన్యాయం

పద్మ అవార్డుల విషయంలోనూ కేంద్రం తెలంగాణకు అన్యాయం చేసిందని సీఎం మండిపడ్డారు. గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరటి వెంకన్న, జయధీర్ తిరుమల రావు లాంటి వారిని గుర్తించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో ప్రధానికి ఈ విషయంపై లేఖ రాయనున్నట్టు వెల్లడించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా రాష్ట్రంలో నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. మంచి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తూ అండగా నిలబడ్డ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

### ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయస్సు 65 ఏండ్లు

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : వర్సిటీ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సును 65 ఏండ్లకు పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం ఈ మేరకు ప్రకటించారు. రాష్ట్రంలో 11 వర్సిటీల్లో 2,817 టీచర్ పోస్టులకు ప్రస్తుతం 757 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 2,060 ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదే విషయాన్ని తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో పేర్కొన్నది. 6-7 వర్సిటీల్లో ఒక్కరంటే ఒక్క ప్రొఫెసర్ కూడా లేరు. రిక్రూట్‌మెంట్ విధానంపై ప్రభుత్వం ఇంత వరకు ఏదీ తేల్చలేదు. నెల నెలా కొందరు ప్రొఫెసర్లు రిటైర్మెంట్ అవుతున్నారు.

# కొత్త బీర్లకు గేట్లు బార్లా

- బీరు మార్కెట్‌కు తలుపులు బార్లా
- కొత్తగా 200 రకాల బీర్లు ప్రవేశం
- వీటిలో వరల్డ్ టాప్ 12 రకాల బీర్లు
- ఉగాది నుంచి క్రొత్త బీరు పాలసీ

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బీర్ బౌల్‌గా మారనున్నది. రాష్ట్రంలో ఇప్పుడున్న వివిధ రకాల బీర్లకు తోడుగా మరో 200 రకాల బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. యువతను ఆకర్షించటం కోసం నాన్ ఆల్కహాలిక్ బీర్లకు కూడా చోటు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విధివిధానాలు రూపొందించే పనిలోఎక్సైజ్ శాఖ నిమగ్నమైంది. త్వరలోనే నోటిఫికేషన్ వెలువడనుంది. ఉగాది పండుగ నుంచే కొత్త బ్రాండ్లను దించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్ నుంచి కొత్త పాలసీ అమల్లోకి రానున్నది.

### తాగితాగి మొఖం మొత్తి..

తెలంగాణలో 85 రకాల లోకల్ బ్రాండ్ బీర్లు, 385 రకాల జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్ బీర్ల సరఫరాకు మాత్రమే అనుమతి ఉన్నది. వీటిలో దాదాపు 40 శాతం బ్రాండ్లు కాలంతో పోటీపడలేక, ఆదరణ కరువై దుకాణం ఎత్తేశాయి. నికరంగా 100 నుంచి 150 రకాల బ్రాండ్లు మాత్రమే నిలిచాయని, గత పదేండ్లుగా ఇవే బ్రాండ్లు మార్కెట్‌లో చలామణిలో ఉండటంతో బీరు ప్రియులకు మొఖం మొత్తిందని ఎక్సైజ్ శాఖ నివేదించింది.

### రండీ..బాబూ రండీ..! యువత తాగాలే..

టీజీబీసీఎల్ అంచనాల ప్రకారం రాష్ట్రంలో ఏటా 10 శాతం మంది కొత్తగా మద్యానికి అలవాటు పడుతుంటారు. గత ఐదేండ్లలో కొత్తగా బీరు తాగేవారి సంఖ్య తక్కువగానే ఉన్నట్టు ఎక్సైజ్ శాఖ గుర్తించింది. యువతను ఆకర్షించే బీరు అందుబాటు లేకపోవటమేనని తేల్చింది. నాన్‌ఆల్కహాల్ బీరులో 0.5 శాతం ఆల్కహాల్‌తోపాటు, తాపకరమైన విలువలు కలిగి ఉంటుందని, యువత ఎక్కువ ఇష్టపడతారని ఆ శాఖ అంచనా వేస్తున్నది. మొత్తంగా మార్చి నెల చివరి నాటికి ప్రముఖ బీరు బ్రాండ్లు మార్కెట్‌లోకి తీసుకు వచ్చే విధంగా ఎక్సైజ్ అధికారులు బీరు పాలసీ రూపొందిస్తున్నారు.

# అవిశ్రాంత పోరాటం

మొదటిపేజీ తరువాయి...

హైకోర్టును ఆశ్రయించారు. టోకెన్లు జారీ అయినా బిల్లులు మంజూరుకాకపోవడంతో ఆయన కోర్టు మెట్లెక్కారు. గ్రాట్యుటీ రూ.16 లక్షలు, కమ్యూటేషన్ రూ.5.73 లక్షలు, సంపాదిత సెలవుల కింద రూ.12.02 లక్షలు, జీపీఎఫ్ రూ.4.9 లక్షలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో న్యాయం కోసం కోర్టుకెళ్లారు. దీంతో 8 వారాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను చెల్లించాలని హైకోర్టు తీర్పునిచ్చింది. నల్లగొండ జిల్లాకు చెందిన భాస్కర్, మంచిర్యాల జిల్లాకు చెందిన ఆగాచారి, మెదక్ జిల్లాకు చెందిన గంగయ్య, రంగారెడ్డి జిల్లాకు చెందిన అన్నపూర్ణమ్మతోపాటు పలువురు విశ్రాంత ఉద్యోగులు, టీచర్లు జీపీఎఫ్, జీఎల్ఐ, శాలరీ ఏరియర్స్‌తోపాటు రిటైర్మెంట్ ఫైనల్ బెనిఫిట్స్ అందకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు 6 వారాల్లోగా విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్ వడ్డీతో అందజేయాలని తీర్పునిచ్చింది.

### వచ్చేదెన్నడో.. తిప్పలు తప్పేదెన్నడో..

- సిరిసిల్ల జిల్లాకు చెందిన ఒక టీచర్ జీపీఎఫ్‌లో రూ.23 లక్షలు ఉండగా, రూ.7 లక్షల తీసుకునేందుకు గతంలో దరఖాస్తు చేశారు. ఇంతవరకూ మంజూరుకాలేదు. మళ్లీ ఇప్పుడు మిగతా మొత్తం కోసం దరఖాస్తు చేస్తే ఏవీ మంజూరుకాలేదు.
- కరీంనగర్ జిల్లాకు చెందిన మరో ఉద్యోగి సంపాదిత సెలవులు సరెండర్ చేయడంతో వచ్చే రూ.3 లక్షల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మంజూరైన దాఖలాల్లేవు.
- మరో టీచర్ ఈఎల్ సరెండర్ బిల్లులు సమర్పించగా, అవి పెండింగ్‌లో పెట్టారు. ఆర్థిక సంవత్సరం మార్చిలో ముగియడంతో కొత్త బిల్లు రీ సబ్మిట్ చేయాలని సూచించారు. కొత్త బిల్లులు సమర్పించిన తర్వాత కూడా పెండింగ్‌లోనే పెట్టారు.
- మరికొన్ని బిల్లులను ఏండ్ల తరబడి ట్రెజరీల్లో పెండింగ్‌లో పెట్టి, ఏడాది తర్వాత మళ్లీ రీ వాలిడేషన్ చేయించుకొని రమ్మంటున్నారు. బిల్లులు రాక అవస్థలు పడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు రీవాలిడేషన్, కొత్త ప్రొసీడింగ్ కోసం మళ్లీ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది.

### గరిష్ఠంగా కోటి

పదవీ విరమణ పొందిన వారికి జీపీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్, గ్రూపు ఇన్స్యూరెన్స్, జీఎల్ఐ, సంపాదిత సెలవులు, పెన్షన్ కమ్యూటేషన్ ప్రయోజనాలు అందాలి. ప్రస్తుతం పెన్షన్ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఈ ఒక్క ఏడాదిలోనే 8000 మందికి పైగా ఉద్యోగులు పదవీ విమరణ పొందుతారు. రిటైర్డ్ అయిన వారికి కనిష్ఠంగా రూ.35 లక్షలు, గరిష్ఠంగా రూ.75 లక్షలు ప్రయోజనాలుగా అందాల్సి ఉన్నది. గెజిటెడ్ క్యాడర్‌లో రిటైర్ అయ్యేవారికి కోటి రూపాయల వరకు చెల్లించాలి. గతంలో ఉదయం బిల్లులు సమర్పిస్తే సాయంత్రం కల్లా అకౌంట్లో డబ్బులు పడేవి. కానీ ఇప్పుడు ఏడాది గడిచినా రిటైర్మెంట్ ప్రయోజనాలు అందడం లేదు. మొత్తం 4000 కోట్ల వరకు ఉం టుందని ఉద్యోగ సంఘాల నేతలు చెప్తున్నారు.